www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024



డెంగీ, మలేరియాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డెంగీ, మలేరియా వంటి ప్రజల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శర్మిష్ట సూచించారు. ఏలూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డెంగీ, మలేరియా అవగాహన కరపత్రాలను బుధవారం డాక్టర్ శర్మిష్ట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు కరపత్రాల ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధుల పైన, దోమల నిర్మూలన పద్ధతులపైన, భవిష్యత్తులో దోమల ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దోమల లార్వాలను నిర్మూలించాలంటే డ్రై డే వంటి కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఇంటి లోపల, బయట వారానికి పైబడి మంచినీరు నిల్వ ఉంచరాదని, నీళ్ల తొట్టెలపై మూతలు పెట్టుకోవాలని, కరపత్రాల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్..!

- అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసిన అధికారులు
- ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవు మంజూరు
- ప్రయివేటు విద్యా సంస్థల్లోని ఓటర్లకు వెసులుబాటు ఆదేశాలు
- ఏలూరులో 20, పశ్చిమలో 20 పోలింగ్ కేంద్రాలు
- రెండు జిల్లాల్లో 6,396 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- ఎన్నికల బరిలో గోపీమూర్తితో సహా ఐదుగురు అభ్యర్థులు
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- 9న కాకినాడలో ఓట్ల లెక్కింపు



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరింది. నవంబర్ 11వ తేదీన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల ఐదో తేదీ గురువారం ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమలో 20 మొత్తం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు ఏలూరు జిల్లాలో 2,667 మంది, పశ్చిమలో 37,29 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 896 మంది ఓటర్ల వరకూ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి పిఒ, ఒపిఒ, మైక్రో అబ్జర్వర్లు మొత్తం ఏలూరు జిల్లాలో 144 మందిని, పశ్చిమలో 130 మందిని నియమించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు వెబ్ క్రాస్టింగ్‌కు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేటు విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయ ఓటర్లకు ఓటు హక్కు వినియోగించునేందుకు వెసులుబాటు కల్పించాలని యాజమాన్యాలకు అధికారులు ఉత్తర్వుల్లో కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యాశాఖ అధికారులు మాత్రం బుధవారం వరకూ సెలవుపై ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన పరిస్థితి కొనసాగింది. ఓటు హక్కు వినియోగించుకునే ఉపాధ్యాయులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ గానీ ఎన్నికల కమిషన్ పేర్కొన్న పది రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. బ్యాలెట్ పద్ధతిలో ఎంఎల్‌సి ఎన్నిక జరగనుంది. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. షేక్ సాబ్జీ మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గెలిచిన అభ్యర్థి 2027 మార్చి వరకూ పదవిలో ఉంటారు.

ఇద్దరి మధ్యే పోటీ..

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ నెలకొంది. పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ప్రస్తుతం ఎన్నిక జరుగుతున్న స్థానంలో గతంలో పిడిఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ గెలుపొందారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక వచ్చింది. దీంతో ఈసారి సైతం పిడిఎఫ్ అభ్యర్థే ప్రధానంగా రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీన కాకినాడలో ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే..

1. బొర్రా గోపీమూర్తి
2. గంధం నారాయణరావు
3. దీపిక పులుగు
4. డాక్టర్ నాగేశ్వరరావు కావల
5. నామన వెంకటలక్ష్మి

ఓటర్ల వివరాలు..

జిల్లా	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం
ఏలూరు జిల్లా	1,489	1,178	2,667
పశ్చిమగోదావరి	2,268	1,461	3,729

జిల్లాలో పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు

ఇళ్లల్లోంచి బయటకు జనం పరుగులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని సీతారామనగరం నుంచి దామరచర్ల వరకూ పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 7.40 నిమిషాలకు భూమి కనిపించింది. ఐదు సెకెన్ల పాటు భూమి కంపించడంతో ఇంటిపై రేకులు కదిలాయని స్థానికులు తెలిపారు. కోతులు అలజడి చేస్తున్నాయేమోనని వెళ్లి చూడగా ఏమీ కనిపించలేదని దామరచర్ల నివాసి బల్లెం రాము తెలిపారు.

చింతలపూడి : మండలంలో భూ ప్రకంపనలు కలకలం సృష్టించాయి. ఒక్కసారి ప్రజలందరూ ఉలిక్కిపడ్డారు. బుధవారం ఉదయం 7:30 సమయంలో చింతలపూడి, పరిసర గ్రామాల్లో పలు సెకన్ల పాటు భూమి కంపించింది. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశామని స్థానికులు తెలిపారు. కొద్ది సెకెన్ల పాటు వైబ్రేషన్ రావడంతో ప్రజలు కంగారు పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

టి.నరసాపురం : మండలంలో బుధవారం ఉదయం భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం సుమారు 7:28 నిమిషాల సమయంలో భూమి ఒక్కసారిగా కదిలినట్లు అనిపించింది. భూ ప్రకంపనలు గుర్తించిన టి.నరసాపురంలో కొందరు భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే టి.నరసాపురం ప్రధాన సెంటర్లో భూమి ఊగినట్లు దృశ్యాలు సిసి కెమెరాలో కూడా నమోదైనట్లు స్థానికులు చెబుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా ఇటువంటి భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం ఒక్క సారిగా చర్చనీయాంశంగా మారింది.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. బుధవారం తెల్లవారుజామున కన్నాపురం రోడ్డులోని అపోలో స్కూల్, సురక్ష హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చాయని స్థానికులు తెలిపారు. షెల్ఫ్‌లోని సామగ్రి, కుర్చీలు కదలడం వంటి ఘటనలు జరిగాయని తెలిపారు. అలాగే కుంతల గూడెం (ఆరిపాటి) గ్రామంలో, కొయ్యలగూడెం తహశీల్దార్ ఆఫీసు దగ్గరలో భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు.

పకడ్బందీగా ఎంఎల్‌సి పోలింగ్ : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో నిబంధలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలింగ్ అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి ఎన్నిక పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రంలో 896 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏరాట్లూ సిద్ధం చేసుకుని, బుధవారం రాత్రి పోలింగ్ కేంద్రం వద్దే ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లకు ఏజెంట్ల సమక్షంలో సీల్ వేసి పోలింగ్ నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. అనంతరం పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. శిక్షణలో తెలిపిన విధంగా పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ వి.శేషగిరి ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా 20 పోలిగ్ కేంద్రాలు..

కుక్కునూరులో జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్, వేలేరుపాడులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జీలుగుమిల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్, బుట్టాయగూడెంలో హైస్కూల్, పోలవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొయ్యలగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జంగారెడ్డిగూడెంలో జెడ్‌పి బాలికల హైస్కూల్, టి.నరసాపురంలో ఎంపిపి స్కూల్, కామవరపుకోటలో జెడ్‌పి హైస్కూల్, ద్వారకాతిరుమలలో ఎంపి అప్పర్ ప్రయిమరీ స్కూల్, చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్, లింగపాలెంలో జిల్లా పరిషత్ హైస్కూల్, ఉంగుటూరులో జిల్లా పరిషత్ హైస్కూల్, భీమడోలులో ఎంపీపీ స్కూల్, పెదవేగిలో జిల్లా పరిషత్ హైస్కూల్, పెదపాడులో జిల్లా పరిషత్ హైస్కూల్, కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు రూరల్‌లో మాగంటి అంజనేయ సత్యవతి జిల్లా పరిషత్ హైస్కూల్ (చాటపర్రు), దెందులూరులో గారపాటి హైమావతి జిల్లా పరిషత్ హైస్కూల్, నిడమర్రులో ఎజికె జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

'పశ్చిమ' విద్యాశాఖ రూటే వేరు..!

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ బేఖాతర్ చేసింది. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలకు పోలింగ్ ముందు రోజు 4వ తేదీన, పోలింగ్ రోజు ఐదో తేదీన సెలవు ప్రకటించాలంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కింది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికకు సంబంధించి జిల్లా విద్యాశాఖ వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పాఠశాలలకు ఎటువంటి సెలవు ప్రకటించకుండా నాలుగో తేదీన యథావిధిగా తరగతులు కొనసాగించిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఎన్నికల సిబ్బంది, పోలీసులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నా తరగతులు కొనసాగుతుండడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తమకు సెలవు ప్రకటనపై అధికారుల నుంచి ఆదేశాలు రాలేదని స్కూల్ ఉపాధ్యాయులు చెప్పడంతో ఎన్నికల సిబ్బంది విస్తుపోయిన పరిస్థితి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికారులు తూచా తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు ఆరు జిల్లాలో జరుగుతుండగా, పశ్చిమలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించిన పరిస్థితి నెలకొందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లా విద్యాశాఖ తీరుపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పాలకోడేరులో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం హైస్కూల్‌ను తెరిచిన వైనం

పోలింగ్ కేంద్రాల పాఠశాలలకు 4న సెలవు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్

20 పోలింగ్ కేంద్రాల పాఠశాలల్లోనూ కొనసాగిన తరగతుల నిర్వహణ

ఎన్నికలు జరిగే అన్ని జిల్లాల్లోనూ సెలవు ఇచ్చినా ఇక్కడ భిన్నంగా పరిస్థితి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవు ఉత్తర్వుల జారీపైన గందరగోళమే

ఉపాధ్యాయులకు సెలవు ఉత్తర్వులపైన ఆఖరు వరకూ గందరగోళమే..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ సందర్భంగా ఈ నెల ఐదో తేదీ పోలింగ్ రోజు ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవు ఇవ్వాల్సి ఉంది. ఎన్నికలు జరుగుతున్న మిగిలిన ఐదు జిల్లాల్లోనూ మంగళవారం సాయంత్రమే సెలవుకు సంబంధించిన ఉత్వర్వులను జిల్లా విద్యాశాఖ అధికారులు జారీచేశారు. ఆ ఉత్వర్వుల్లో ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఓటర్లకు వెసులుబాటు కల్పించాల్సిందిగా పేర్కొనడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమర్ ప్రసాద్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ మంగళవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఈ ఆదేశాలను పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారులు తుంగలోతొక్కి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉపాధ్యాయులకు సెలవు ఉత్వర్వులు జారీచేయాలంటూ ఉపాధ్యాయ సంఘం నేతలు అధికారులను కలిసి విన్నవించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. బుధవారం సాయంత్రానికి మెసెజ్ రూపంలో ఉపాధ్యాయులకు సెలవు ఇస్తున్నట్లు ప్రకటించి మమ అనిపించారు. ఎన్నికలు జరుగుతున్న అన్ని జిల్లాల్లో కంటే పశ్చిమలోనే అత్యధికంగా 3,729 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఉప ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ బూతులు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో సెలవు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఆదేశాలను పాటించకుండా ఒంటెద్దు పోకడగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

కలెక్టర్‌కు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల్లో జరుగుతున్న టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి కోరారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగారాణిని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పూర్తి రోజు స్పెషల్ క్యాజువల్ వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నూరు శాతం ఉపాధ్యాయులకు ఓటు ఉన్న పాఠశాలలకు సెలవు ప్రకటించాలని లేదా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, కోశాధికారి బి.పట్టాభిరామయ్య ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

అకాల వర్షం : వరికి నష్టం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం కురవడంతో వరి పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే వరి మాసూళ్లు చేపట్టిన రైతులు తమ ధాన్యాన్ని గట్టుకు, మిల్లులకు చేర్చే సమయంలో అకాల వర్షంతో ధాన్యపు రాసులు తడిసిపోయాయి. దీంతో ధాన్యపు రాసుల వద్ద నీరు నిలిచిపోయింది. రహదారుల వెంబడి ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. అకాల వర్షం అకస్మాత్తుగా రావడంతో పలు గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. వాయుగుండం ప్రభావంతో గత వారంలో నాలుగు రోజులపాటు వర్షాలు పడడంతో రైతులు మాసూళ్ళ, కోతలు వాయిదా వేశారు. మరలా వాతావరణం అనుకూలించడంతో రెండు రోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం పడింది. వర్షం నేపథ్యంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



తడిసిన ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జి తెలుగు న్యూస్ విలేకరిపై దాడికి పాల్పడినవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మీడియా ద్వారా అందుతున్న సమాచారం మేరకు జి తెలుగు న్యూస్ ఛానల్ విలేకరి గతంలో స్థానిక జనసేన ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుపై "పవన్ మాటపై పట్టింపు లేని ఎంఎల్‌ఎ వసూళ్లకు దిగాడు" అనే వార్తను రాసినందుకు సదరు ఎంఎల్‌ఎ అనుచరులు కొయ్యలగూడెంలో సోమవారం రాత్రి దాడి చేసినట్లు తెలుస్తుందని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి దాడికి పాల్పడినవారిని, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. దాడికి గురైన దుర్గాప్రసాద్ వాదన ప్రకారం పోలవరం ఎంఎల్‌ఎపై వార్త ప్రచురించినప్పటి నుంచి బెదిరింపునకు పాల్పడుతున్నారని, సోమవారం రాత్రి మోటర్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దారి కాచి, కారం చల్లి, దాడికి పాల్పడ్డారని తెలుస్తుందని పేర్కొన్నారు. విలేకరి ప్రచురించిన వార్త అవాస్తవమైతే దానిని ఖండించవచ్చని, లేదా ఆ వార్తను వ్యతిరేకిస్తూ వాస్తవాలతో కూడిన మరొక వార్త ఎంఎల్‌ఎ నుంచి ఇవ్వవచ్చని తెలిపారు. రాజ్యాంగాన్ని పాటించాల్సిన, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు ఈ విధంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛ గొంతునొక్కే చర్యగానే చూడాలని తెలిపారు. దాడులకు పాల్పడమని, దౌర్జన్యాలు చేయమని, శాంతిభద్రతలు కాపాడుతామని చెబుతున్న కూటమి ప్రభుత్వం, అందులో ఉన్న జనసేన పార్టీ కూడా ఈ వ్యవహారంపై ఆలోచించాలని, ఇటువంటి దాడులకు పాల్పడిన ఎంఎల్‌ఎలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగు బూత్‌లను పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించినట్లు తెలిపారు. అధికారులు అన్ని మౌలిక వసతులు కల్పించారని, పోలీసు శాఖ తరపున సబ్ డివిజన్ పరిధిలో అన్ని ఎన్నికల కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, ఎఎస్ఐ నాగేశ్వరరావు, తహశీల్దార్ సాయిరాజు, డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ కేంద్రాలను తహశీల్దార్ కె.చెల్లన్నదొర బుధవారం పరిశీలించారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌ను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. మొత్తం 113 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తహశీల్దార్ తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


నూజివీడు పట్టణంలో 10,15వ వార్డులో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయ అడ్మిన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ పదో వార్డులో మొగలచెరువు మెరక ప్రాంతంలో 200 కుటుంబాలవారు గత 60 ఏళ్ల నుంచి అక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని చెప్పారు. వారంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారన్నారు. ఏళ్లు గడుస్తున్నా వారి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. ఇప్పుడున్న ప్రభుత్వమైనా అక్కడ నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 15వ వార్డు ఎన్‌టిఆర్ కాలనీ చివరి భాగంలో 22 కుటుంబాల వారు గత 20 సంవత్సరాల నుంచి అక్కడ నివాసం ఉంటున్నారని, వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, ఎస్‌కె.బాష, శంకరరావు, కేశవరావు, నవీన్ పాల్గొన్నారు.

విద్యారంగంలో అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యాశాఖాధికారికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ పాఠశాల పనివేళల పెంపు, పది శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు విధించడం, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధ పేరుతో వంద రోజులు యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయన్నారు. ముఖ్యంగా మండలాల్లో పది శాతం మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదని మండల విద్యాశాఖ అధికారులు అత్యవసర సందర్భంగా కూడా సెలవులు మంజూరు చేయటం లేదని, ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పని చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

తేమ శాతం పేరుతో అన్యాయం తగదు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - పెదవేగి

తేమ శాతం పేరుతో ధాన్యం మద్దతు ధరలో కోత పెట్టి రైతులకు, కౌలు రైతులకు అన్యాయం చేయడం తగదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పెదవేగి మండలంలోని వంగూరు, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించి ఎపి రైతు సంఘం నాయకులు కల్లాలోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతులను, కౌలు రైతులను ధాన్యం కొనుగోలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం లెక్కింపులో జరుగుతున్న మోసాల పట్ల నిరసన వ్యక్తం చేశారు. వంగూరు రైతు సేవా కేంద్రంలో తేమశాతం లెక్కింపును రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో లెక్కించిన తేమ శాతానికి భిన్నంగా రైస్ మిల్లుల్లో అధిక తేమ శాతం చూపి అన్నదాతలను ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. వంగూరులోని జోజి అనే కౌలు రైతుకు ఆరబెట్టిన ధాన్యానికి రైతు సేవా కేంద్రంలో 17.2 తేమ శాతం రాగా పెదవేగి రైస్ మిల్లులో 20 శాతంగా చూపుతున్నారని చెప్పారు. మరో రైతు ధాన్యానికి రైతు సేవా కేంద్రంలో 15.5 శాతం తేమ రాగా రైస్ మిల్లులో 21 శాతంగా చూపుతున్నారని వివరించారు. తేమ శాతం లెక్కింపులో జరుగుతున్న మోసాలు వల్ల అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రంలో తేమశాతం లెక్కించిన తర్వాత గోనె సంచులిస్తున్నారని, ధాన్యాన్ని లోడ్ చేసి మిల్లుకు తీసుకెళ్లిన తర్వాత తేమ శాతం పేరుతో తేడాలు చూపించి ధరలో కోత పెట్టి అన్నదాతలను దోపిడీ చేయడం దారుణమని విమర్శించారు. తేమ 18 శాతం వచ్చినా ధాన్యాన్ని సేకరిస్తున్నామని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన లేదన్నారు. తేమ శాతం పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టి కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం రవాణా, హమాలీ ఛార్జీలు కౌలు రైతులకే చెల్లించాలన్నారు. జి.జోజి, ఎం.అబ్రహం, కె.సీతారామయ్య, జి.నాగేశ్వరరావు, ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

90 శాతం రాయితీపై బిందు సేద్య పరికరాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉద్యాన శాఖ ద్వారా 90 శాతం రాయితీపై బిందు సేద్య పరికరాలు అందించనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారిణి నవీన మణిమాల రైతులకు సూచించారు. మండలంలోని దర్భగూడెం, స్వర్ణవారిగూడెం రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గంగాధర్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి బుచ్చారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు సాయి బుచ్చారావు మాట్లాడుతూ పాడి రైతులకు పలు రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటికి రైతులు పశు గణనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ లక్ష్మీప్రసన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్లు రష్మి, దుర్గ, రైతు సంఘం అధ్యక్షుడు దాసరి జానకి రామిరెడ్డి, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పునఃసమీక్షించాలి

ప్రజాశక్తి - కలిదిండి

విద్యాశాఖ ఎస్‌సిఇఆర్‌టి పదో తరగతి పరీక్షల దృష్ట్యా రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో అనేక అసంబద్ధమైన అంశాలు ఉన్నాయని, సిలబస్ పూర్తి కాకుండానే అమలు చేయాలని ఆదేశించడం సరికాదని డెమొక్రటిక్ పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీను అన్నారు. కలిదిండిలో ఆ సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతుల నిర్వహణతో పాటు ఆదివారాలు, పండుగ రోజుల్లో ప్రత్యేక తరగతులు, పబ్లిక్ సెలవుల్లో తరగతుల నిర్వహణ వంటివి ఉపాధ్యాయులలో అశాంతి, ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. పది శాతానికి మించి సెలవులు ఇవ్వకూడదనే నిబంధనలు ఉపాధ్యాయ వర్గాన్ని ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పునఃసమీక్ష చేయాలని, సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఆ శాఖ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ.దేవానంద్, ఎండి సనావుల్లా, జిల్లా కార్యదర్శ సభ్యులు షేక్ రామారావు, జి.బాలాజీ, జి.నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు డివి.నాగేశ్వరరావు, వి.కుమారస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.పోతురాజు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో అందించారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన మీసాల చింటూకు రూ.5,14,533, చిరిసేపల్లి ఆదిలక్ష్మికి రూ.81 వేలు, ఉంగుటూరు గ్రామానికి చెందిన సుంకవల్లి సులోచనరాణికి రూ.2,99,400, కాగుపాడు గ్రామానికి చెందిన కడియాల బాపయ్యమ్మకు రూ.1.62 లక్షలు, నాచుగుంట గ్రామానికి చెందిన కాజా వీర్రాజుకు రూ.1,25,185, నిడమర్రు మండలం ఛానమిల్లి గ్రామానికి చెందిన దూలం సత్యనారాయణకు రూ.1,43,338, దేవర గోపారం గ్రామానికి చెందిన తుమ్మల వరలక్ష్మి రూ.లక్ష, భీమడోలు గ్రామానికి చెందిన మరడాని శివ నరేంద్రకు రూ.99,508 అందించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పాతూరి కృష్ణంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని ఎం.ఎన్.పాలెం, సీతారాంపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఫసల్ బీమా యోజనలో ఎకరాకు వరి రూ.500 ప్రీమియం చెల్లిస్తే రూ.41 వేలు ఇన్సూరెన్స్ లభిస్తుందని, విత్తన మొక్కజొన్నకు ఎకరాకు రూ.483 ప్రీమియం చెల్లిస్తే రూ.42 వేలు ఇన్సూరెన్స్ లభిస్తుందని, మినుము ఎకరాకు రూ.60 ప్రీమియం చెల్లిస్తే రూ.20 వేలు ఇన్సూరెన్స్ లభిస్తుందని, పెసర ఎకరాకు రూ.60 ప్రీమియం చెల్లిస్తే రూ.20 వేలు ఇన్సూరెన్స్ లభిస్తుందని తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపునకు వరి సాగు రైతులకు ఈనెల 30 వరకు అవకాశం ఉందని, మిగతా విత్తన మొక్కజొన్న, మినుము, పెసరలకు ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు : పెదపాడు మండల రైతులు సార్వా సాగు చివరి దశ అయిన వరి కోత తర్వాత వచ్చిన గడ్డిని తగలబెట్టకుండా ఆ గడ్డిని కట్టలుగా కట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ రైతులకు సూచించారు. ఆ విధంగా గడ్డిని తగలబెట్టడం వల్ల భూమి సారాన్ని కోల్పోతుందని, పంటకి మేలు చేసే సూక్ష్మజీవులు నాశనమవుతాయని అవగాహన కల్పించారు.

సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి - చింతలపూడి

స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త రాజకీయవేత్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని జనసేన తడికలపూడి మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. మండలంలోని గణిజర్ల గ్రామంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్ఠ నిర్మాణానికి ఆయన రూ.5116 విరాళంగా అందించారు. టిడిపి, జనసేన గణిజర్ల గ్రామ నాయకులకు ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అప్పుల బాధ తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - మండవల్లి

అప్పుల బాధ తాళలేక వివాహిత కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లోకముడిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లోకముడి గ్రామానికి చెందిన మత్తే పేతురు, సుజాత దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుజాత కుటుంబ అవసరాల నిమిత్తం కొంతమంది దగ్గర అప్పు చేసింది. తిరిగి ఆ అప్పును చెల్లించలేకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు తీసుకున్న అప్పును వెంటనే చెల్లించాలని సుజాతను వేధించసాగారు. అంతటితో ఆగకుండా సుజాత ఇంటికి వెళ్లి అప్పు కట్టలేనప్పుడు ఎందుకు తీసుకున్నారంటూ ఇంటి వద్ద, గ్రామంలో అల్లరి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత అప్పు తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో బుధవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో ఇంటి పనులు నిర్వహించుకుంటూ భర్త పేతురు బాత్రూంలోకి వెళ్లగానే సుజాత ఇంట్లోకి వెళ్లి కవర్లను, పేపర్లను ఒంటికి చుట్టుకుని డబ్బాలో ఉన్న కిరోసిన్‌ను పోసుకొని నిప్పటించుకుంది. ఇది గమనించిన భర్త, తోటికోడలు, మరదలు దుప్పట్లు, బొంతల సహాయంతో మంటలను అదుపుచేశారు. సుజాతను వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుని అరెస్టు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కన్నాపురంలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కన్నాపురంలో ఎక్సైజ్ శాఖ బుధవారం నిర్వహించిన దాడిలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

పంట ధ్వంసంపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

పంట ధ్వంసంపై కేసు ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన చెన్ను రాంబాబు తనకు చెందిన 80 సెంట్ల భూమిలో పొగాకు పంటను సాగు చేసుకున్నాడు. ఆ పంట మూడు నెలల కాలం పూర్తి కాగా ఇంకా ఒక నెలలో పంట చేతికొచ్చే సమయంలో అదే గ్రామానికి చెందిన గండిపూడి రవి రెండు రోజుల క్రితం తన ఇంటికి వచ్చి భూ సరిహద్దు విషయం తేల్చకపోతే పంటను నాశనం చేస్తానని హెచ్చరించాడని రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి రవి, అతని కుటుంబ సభ్యులే పంట ధ్వంసం చేసి ఉంటారని రాంబాబు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎఎస్ఐ నాగభూషణం, గ్రామ పెద్దలు తోట శ్రీనివాసరావు, కొండేటి ఉదయ్‌కిరణ్, గ్రామ పెద్దలు కలిసి పరిశీలించారు.

అత్యుత్తమ బోధన స్పామ్ ఐటిఐ ప్రత్యేకత

ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన స్పామ్ ఐటిఐ అటు కృష్ణా, ఇటు ఏలూరు జిల్లాల్లో కెల్లా అత్యుత్తమ బోధన అందిస్తున్న ఐటిఐగా గుర్తింపు పొందిందని ప్రిన్సిపల్ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ స్పామ్ ఐటిఐ కూనప రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో 1998 నుంచి నేటి వరకు నిర్విరామంగా కొనసాగుతుందని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఐటిఐ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఐటిఐ పరిస్థితిని తెలుసుకున్న తర్వాతే ఐటిఐ కోర్సుల్లో చేర్చుకోవడం ఈ ఐటిఐ విశేషమన్నారు. ఈ ఐటిఐలో శిక్షణ పొందిన విద్యార్థులు నేడు వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల్లో అత్యున్నత హోదాల్లో స్థిరపడ్డారన్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటిఐకి ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదన్నారు. గత దశాబ్దం కాలంగా ఐటిఐలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ఐటిఐ పూర్తయిన తర్వాత నేరుగా పాలిటెక్నిక్, డిప్లమో రెండో సంవత్సరంలో చేరే అవకాశం కూడా ఉందన్నారు. ఐటిఐ పాసైతే వివిధ సంస్థల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందే వీలుందని తెలిపారు. ఈ కారణంగా ఐటిఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారన్నారు.



స్పామ్ ఐటిఐ కళాశాల


పెరిగిన గిరాకీ

పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత ఐటిఐ కోర్సు పూర్తిచేస్తే ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగం గ్యారెంటీ కావడంతో యువత ఇటు వైపుగా ముందుకు సాగుతున్నారన్నారు. దీంతో ఐటిఐ కోర్సులకు తిరిగి గిరాకీ ఏర్పడిందని తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లాలోనే డిజిఇ అండ్ టి సెంట్రల్ గవర్నమెంట్ చే ఉత్తమ గ్రేడింగ్ పొందిన సంస్థగా ఎస్‌పిఎఎం ఐటిఐని తీర్చిదిద్దారని తెలిపారు.

ఐటిఐ రూటు.. ఉపాధికి చోటు

ఇప్పుడు ఐటిఐ రూటు.. ఉపాధికి చోటుగా మారిందన్నారు. ఐటిఐ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయా రంగాల్లో స్థిరపడే అవకాశాలు వెల్లువలా వస్తున్నాయన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పారిశ్రామిక శిక్షణ సంస్థలు నైపుణ్యాభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ట్రేడ్ పూర్తిచేసిన వెంటనే వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తుండడంతో యువత ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. కృష్ణా, ఏలూరు గోదావరి జిల్లాల్లో ప్రయివేట్ ఐటిఐల్లో దాదాపు 20 ఏళ్ల అనుభవం కలిగిన అధ్యాపకులకు అత్యధిక జీతాలు ఇస్తున్న ఐటిఐ కూడా స్పామ్ ఐటిఐ ఒక్కటేనన్నారు.

దేశంలో ఉన్న స్కిల్ ఇండియా ద్వారా నడుపుతున్న ఐటిఐల్లో అత్యుత్తమ నైపుణ్యత గలది స్పామ్ ఐటిఐ అని తెలిపారు. ఏలూరు జిల్లాలో డిజిటల్ వర్క్ షాపులు ఉన్న మొట్టమొదటి ఐటిఐగా స్పామ్ ఐటిఐ ఉందని తెలిపారు. శిక్షణ తర్వాత స్కిల్స్ ఉన్నవారికి ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థలు, బిహెచ్ఎల్, ఇస్రో, అశోక్ లైలాండ్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగించాలనే ఉద్దేశంతో సరికొత్త కంప్యూటర్లతో శిక్షణ ఇస్తూ ఐటిఐల్లో ఎస్‌పిఎఎం ఐటిఐ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రథమ స్థానంలో ఉందన్నారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడుల్లో శిక్షణా తరగతులకు అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో మెరుగైన శిక్షణ ఇస్తున్నారన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద, మధ్యతరగతి విద్యార్థులు ఏ విధమైన అధిక ఫీజులు లేకుండా కేవలం ప్రభుత్వం వారి నిర్ణయించిన ఫీజు ప్రకారం ప్రభుత్వ ఫీజు రియంబర్స్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణ పొందవచ్చన్నారు. రాయితీతో కూడిన బస్సు పాస్, ట్రైన్ పాస్ కలవన్నారు. ప్రభుత్వ హాస్టల్‌లో ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో బోధన
కూనపరెడ్డి సత్యనారాయణ, ప్రిన్సిపల్



నాది కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామం. వ్యవసాయ కుటుంబంలో జన్మించి డిప్లొమా చేసి ఉయ్యూరు విక్రమ్ ఐటిఐలో 14 ఏళ్ల పాటు ఇన్స్ట్రక్టర్‌గా పని చేశాను. ఆ తర్వాత ముదినేపల్లిలో మూతపడిన ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాలను పునఃప్రారంభించి ఐటిఐ కళాశాలను అదే పేరుతో కొనసాగిస్తున్నాం. గత 40 ఏళ్లుగా ఎంతోమంది ఐటిఐ విద్యార్థులను తీర్చిదిద్దా. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడుల్లో శిక్షణా తరగతులకు అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో మెరుగైన శిక్షణ ఇస్తున్నాం.

నూజివీడులో 'సారథి మన వారధి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సారథి మన వారధి కార్యక్రమం రెండో రోజు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు అర్జీలను సమర్పించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 869, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 524, విద్యుత్ శాఖకు సంబంధించి 11, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 327 అర్జీలను స్వీకరించినట్లు ఎంపిడిఒ సి.రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వాటిని నాణ్యమైన పరిష్కారం అందేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆరేపల్లి శిరీష, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి : రాష్ట్ర మంత్రి పార్థసారధి ఆదేశాల మేరకు చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి 99 అర్జీలు అధికారులు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 57 అర్జీలు, విద్యుత్ శాఖకు సంబంధించి ఐదు అర్జీలు, పోలీస్ శాఖకు సంబంధించి మూడు అర్జీలు, వైద్య శాఖకు సంబంధించి రెండు అర్జీలు, మిగతావి పంచాయతీరాజ్ సంబంధించిన అర్జీలు వచ్చాయి. రెండు రోజుల్లో మొత్తం 165 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎంపిడిఒ ఐ.విజయలక్ష్మి తెలిపారు. అర్జీలన్నీ పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బ్రహ్మాచారి, మండల విద్యుత్ శాఖ ఎఇ డి.సంజయ్, మండల వ్యవసాయ శాఖ అధికారి బండారు శివశంకర్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ ఫిరంగి నవ్య, పంచాయతీ కార్యదర్శి మట్టా శివనాగరాజు, టిడిపి మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు పాల్గొన్నారు.

బెదిరింపులపై ఎఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొవ్వ ఫణీంద్ర బుధవారం ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందించారు. ఆయన వివరాల ప్రకారం.. పేరూరులో ఇటీవల కోడి వ్యర్థాలను ఫంగస్ చేపల చెరువుల్లో సాగు చేస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ సమస్యపై అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలను తొలగించారన్నారు. కోడి వ్యర్థాలను తింటున్న చేపలు ఆ చెరువులో అలాగే ఉండటంవల్ల ఆ చేపలను ప్రజలు తింటే రోగాలు బారిన పడే అవకాశం ఉందని గ్రహించి ఆ చెరువులో ఉన్న చేపలను స్వాధీనం చేసుకోవాలని ఈనెల రెండో తేదీన తహశీల్దార్, ఎంపిడిఒలకు తాను వినతిపత్రం అందించినట్లు ఫణీంద్ర తెలిపారు. దీంతో తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఫణీంద్ర అడిషనల్ జిల్లా ఎస్‌పి సూర్యచంద్రరావుకు వినతి పత్రం అందించారు. ఈ విషయంపై విచారణ చేసి ఫోన్ కాల్ చేసిన నాగేశ్వరరావుపై, ఈ సమస్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎఎస్‌పిని కోరానని ఫణీంద్ర తెలిపారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుకు స్వల్పకాలిక శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలో స్కిల్ హబ్ ద్వారా సత్రంపాడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.రజిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు అప్లికేషన్స్ స్వీకరించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఐటిఐ కాలేజీ ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఆపైన చదువుకున్న ఖాళీగా ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. వయసు 30 ఏళ్ల లోపు ఉండాలన్నారు. పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 8978524022 సంప్రదించాలని తెలిపారు.

రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - పెదవేగి

భీమడోలు, పెదవేగి 232 కెవి ఫీడర్ ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్పు చేయడం కారణంగా ఈ నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్, కెఎం.అంబేద్కర్ తెలిపారు. 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రం, పెదవేగి పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాలకు చెందిన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని ఆయన కోరారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలంలో ఈ నెల ఆరో తేదీ నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నూజివీడు తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఈ సదస్సుల్లో భూ వివాదాలు, 22ఎ భూ వివాదాల అర్జీలను స్వీకరిస్తారని, ప్రజలు ఈ సదస్సులను వినియోగించుకోవాలని తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

ఉభయ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాల్లో 2,667 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఏలూరు అర్బన్ పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 896 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా కుక్కునూరు మండలంలో ఆరుగురు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు 144 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సహాయ పడేందుకు హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెల తొమ్మిదో తేదీన కాకినాడలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. తొలుత డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లను, బ్యాలెట్ బాక్స్‌లను ఇతర స్టాట్యూటరీ సామగ్రిని పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరిష్ ఉన్నారు.

సత్యనారాయణకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరరానికి చెందిన కోనే వీరవెంకటసత్యనారాయణకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కార్ అవార్డును జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా అందుకున్నారు. మంగళవారం ఏలూరులో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రారావు, డిఆర్‌డిఎ పీడీ విజయరావు, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ అవార్డు రావడం పట్ల గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సత్యనారాయణను అభినందించారు.

భీమడోలులో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

ప్రజాశక్తి - భీమడోలు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భీమడోలు మండల పరిధిలోని విద్యార్థుల స్థాయిని పరిశీలించేందుకు బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (పరాక్ రాష్ట్రీయ సర్వేషణ్-2024) కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని మండల విద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండల స్థాయిలో అంచనాలను నిర్ణయించేందుకు మండల పరిధిలోని ఒక ప్రాథమికోన్నత, ఒక ప్రయివేట్, నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మూడు, ఆరు, ఎనిమిది తరగతులకు చెందిన విద్యార్థులకు మూడు సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలకు 144 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. దీంతోపాటు పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించేందుకు ఉపాధ్యాయుల ద్వారా ఇదే రూపంలో సమాచారం సేకరించినట్లు చెప్పారు. గుండుగొలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం పాండురంగారావు, సిఆర్‌ఎంటి రమణతో పాటు మరొక ఆరుగురు స్వచ్ఛంద కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారని విద్యాధికారి తెలిపారు.

రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - దెందులూరు

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. మండలంలోని శ్రీరామవరం రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నాణ్యత, పొడవు, వెడల్పు, అంచనా ఖర్చు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామవరం గ్రామానికి చెందిన కామిరెడ్డి సోము బ్రహ్మం కలిసి కలెక్టర్ రోడ్ల నిర్మాణ పనులపై ఆరా తీశారు. పల్లంగా ఉన్నందున కొంత మేరకు సీసీ రోడ్లు పది రోజుల్లో పూర్తి చేస్తారని తెలిపారు. ఈ గ్రామం నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతు పనులు కొనసాగిస్తున్నామని ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే కలెక్టర్‌కు వివరించారు. రోడ్డుకు డ్రెయినేజీ ఏర్పాట్లకు కొంతమేరకు స్థలాన్ని వదులుతున్నారా లేదా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గతంలో రోడ్డు పరిస్థితి రోడ్డు మరమ్మతులు చేసి తర్వాత ఉన్న పరిస్థితికి సంబంధించిన ఫొటోలను అందించాలని చెప్పారు.

పెదవేగి : పెదవేగి మండలంలోని ముండూరులో చేపట్టిన రోడ్ల నిర్మాణాలను కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయా పనులకు సంబంధించి వివరాలను అధికారులు కలెక్టర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని అధికారులకు సూచించారు. నిర్దేశించిన గడువులోగా చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమెతో పాటు ఆర్అండ్‌బి ఎస్‌సి జాన్‌మోషే, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సుబ్బారావు మృతి కళారంగానికి తీరనిలోటు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ బుర్రకథ కళాకారుడు పొట్టేలు సుబ్బారావు మృతి కళారంగానికి తీరని లోటని ఎపి జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు అన్నారు. సుబ్బారావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఎపి ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్, సీనియర్ బుర్రకథ కళాకారుడు టివిఎస్.రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్‌లు సంతాపం తెలిపారు. బొర్రంపాలెం శ్రీ సరస్వతి బుర్రకథ బృందంలో సుదీర్ఘ కాలం రాజకీయ వంతగా పదుల సంఖ్యలో బుర్రకథ ప్రదర్శనలు పాల్గొన్న సుబ్బారావు మృతి చెందటం బుర్రకథ కళారంగానికి తీరని లోటని కృష్ణబాబు అన్నారు. సీనియర్ బుర్రకథ కళాకారుడు బొర్రంపాలేనికి చెందిన మామిళ్లపల్లి సుబ్బారావు శిష్య బృందంలో ఒకడైన సుబ్బారావు గత ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారని, ఆయనతో సుదీర్ఘకాలం కళా రంగంలో స్నేహంతో మెలిగామని వీరమల్ల సత్యనారాయణ, నందకుమార్ తెలిపారు.

6న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాల విద్యా డైరెక్టర్ ఆదేశాల మేరకు కళాఉత్సవ్ 2024 - 25లో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వివిధ కళాంశాల్లో వ్యక్తిగత, గ్రూపు విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య కళలు, సాంప్రదాయ కథ చెప్పడం అనే అంశాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో ఈ నెల ఆరో తేదీన జిల్లా విద్యా శిక్షణా సంస్థ, డైట్ దూబచర్లలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల ప్రభుత్వ, ప్రయివేట్ ఎయిడెడ్, కెజిబివి, మోడల్ స్కూల్ ఇతర యాజమాన్య పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు వ్యక్తిగతంగా కాని, ఐదుగురు సభ్యులు మించకుండా గ్రూపుగా గాని పాల్గొనవచ్చని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదని, గత సంవత్సరం కళా ఉత్సవంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారు ఈ సంవత్సరం పోటీకి అనర్హులని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే శిక్షణ పొంది ఉండాలని, ఒక విద్యార్థి ఒకటి కంటే ఎక్కువ అంశాల్లో పోటీ పడరాదని, జిల్లాస్థాయిలో ప్రతి అంశంలోనూ ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. వివరాలకు పి.ఎ.రమణమూర్తి 9951817359 సంప్రదించాలని తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ డిఇ కృష్ణకుమారి సిబ్బందికి సూచించారు. మండలంలోని రామన్నపాలెం, చంద్రమ్మ కాలనీ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రావెల్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. క్వాలిటీ మెటీరియల్ ఉపయోగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎఇ నవీన్, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమంత్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్ పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా బెనిఫిట్ షో నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. థియేటర్ యాజమాన్యంతో మాట్లాడి షోల వివరాలు అడిగి తెలుసుకున్నారు. థియేటర్‌లో సీటింగ్, మౌలిక వసతులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కలిదిండిలో రోశయ్య వర్ధంతి

ప్రజాశక్తి - కలిదిండి

మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతిని పురస్కరించుకుని కలిదిండిలో ఆయన చిత్రపటానికి మండల ఆర్యవైశ్య సంఘం, టౌన్ అధ్యక్షులు పూర శ్రీధర్, ఎంపిటిసి నీలి సుమన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

మెగా పేరెంట్స్ వేడుకలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ చెప్పారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఈ నెల ఏడో తేదీన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

కాళ్ళ మండలం, దొడ్డనపూడి, డోర్ నెంబర్ 1-164 చర్చి వద్ద, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, ఎ.పికి చెందిన తెనాలి మహిమ, తండ్రి తెనాలి మాణిక్యం తెలియజేయునది ఏమనగా నేను ది 10-09-2018లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి S3917644 నెంబర్ పాస్ పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను తీసికొని దొడ్డనపూడి నుంచి శివదేవుని చిక్కాలలో బంధువులు ఇంటికి ది.23-11-2024న వీసా గురించి మాట్లాడటానికి ఆటోలో వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దొరకలేదు.కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్ : 7032404750

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, పండిత విల్లూరు తూర్పు పాలెం గ్రామానికి చెందిన బొక్కా చిన్న మంగరావు, తండ్రి బొక్కా నాగేశ్వరరావు డోర్ నెంబర్ 1-87కు చెందిన. U8125933 విశాఖపట్నం 16-05-2008లో జారీ చేసిన పాస్ పోర్ట్ పోయినది. తూర్పు పాలెం నుంచి ఒరిజినల్ పాస్‌పోర్టుతో వీసా నిమిత్తం మోటార్ సైకిల్ పై పోడూరు వెళ్తుండగా పాస్ పోర్ట్ కలిగిన కవరు మార్గ మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా ఎక్కడ దొరకలేదు. కావున నా పాస్పోర్ట్ ఎవరికైనా దొరికితే ఈ కింది అడ్రస్కు తెలియపరచగలరు.

బొక్కా చిన్న మంగరావు, తండ్రి బొక్కా నాగేశ్వరరావు, డోర్ నెంబర్ 1-87, పండిత విల్లూరు, తూర్పు పాలెం, పోడూరు మండలం, ప.గో.జిల్లా., ఎ.పి., పిన్:534122. సెల్ నెం.8340924278.

పాస్‌పోర్టు పోయినది

ఆచంట మండలం, పెనుమంచిలి పంచాయతీ పరిధి అరుంధతి పేట గ్రామానికి చెందిన కొండేటి మణి భర్త ఏసుదాసు కు చెందిన. X5981590 నెంబరు గల విశాఖపట్నం వారు 16-03-2023. తేదీన జారీ చేసిన పాస్ పోర్ట్ పోయినది. పెనుమంచిలి నుంచి ఆటోలో వీసా పర్పస్ నిమిత్తం ఆచంట వెళ్తుండగా పాస్పోర్ట్ కలిగిన కవరు మార్గ మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా ఎక్కడ దొరకలేదు. కావున నా పాస్పోర్ట్ ఎవరికైనా దొరికితే ఈ కింది అడ్రస్కు తెలియపరచగలరు.

కొండేటి మణి, భర్త ఏసుదాసు, డోర్.నెం.3-124 అరుంధతి పేట, పెనుమంచిలి, ఆచంట మండలం, ప.గో.జిల్లా, ఎపి., పిన్ : 534 123, సెల్: 9505120779